క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ కొమ్ము ముక్కంటి మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యాలయంలో నిర్వహించటం జరుగుతుందని కౌన్సిల్ సభ్యులంతా సమయ పాలన పాటించి సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయానికి నూతనంగా విధులకు హాజరైన కమిషనర్ డీఎస్ గిరికుమార్‌ను మంగళవారం పట్టణ సచివాలయ యూనియన్ నాయకులు, సచివాలయ సిబ్బంది శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డీఎస్ గిరికుమార్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా విధులు నిర్వహించి పిడుగురాళ్ల మున్సిపాలిటీని అభివృద్ధిలో నడిపించి పుర ప్రజలకు మరింత సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ యూనియన్ దాసరి వెంకట్, ఇల్లూరి కొండలు, రాజేశ్వరి పట్టణంలోని 17వ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూరిగుడిసె దగ్ధం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆదర్శ కాలనీలో కూలి పనులు చేసుకునే కుంభా వెంకటేశ్వర్లుకు చెందిన పూరిగుడిసె మంగళవారం పూర్తిగా కాలి బూడిదైంది. కూలి పనులకు పొలం వెళ్లటంతో గుడిసెలో ఎవరు లేరు. కుంభా వెంకటేశ్వర్లు భార్య కుమారి వికలాంగురాలు, అయినప్పటికీ పనులకు వెళ్లటంతో ఇంట్లో ఎవరు లేరు. ఇరుపొరుగు వారు గమనించి పిడుగురాళ్ల అగ్నిమాపక శాఖకు సమాచారం అందించటంతో మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో గుడిసెలో ఉన్న వంట సామాను, దుస్తులు తదితరాలు పూర్తిగా కాలిపోవటంతో నిరాశ్రయులయారు. సుమారు రూ.40 వేల వరకు ఆస్తి నష్టం ఉంటుందని బాధితులు తెలిపారు.

అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు

విజయపురిసౌత్: అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు వస్తుందని స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శరత్‌బాబు అన్నారు. మంగళవారం ఏపీఆర్ జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకుడు సదానంద్ జగదీశ్వర్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగదీశ్వర్ పనిచేసిన ఆయా కళాశాలల్లో నిబద్ధతతో పనిచేసి విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారని ప్రశంసించారు. అనంతరం జగదీశ్వర్, పద్మాబాయి దంపతులను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లింగేశ్వరావు, వేణుగోపాల్, సుబ్బారెడ్డి, రాజశేఖర్, పుల్లయ్య, నాగేంద్రబాబు, వీరేష్, శ్రీనునాయక్, హనుమంతరావు, రికార్డ్ అసిస్టెంట్ గోపయ్య పాల్గొన్నారు.

క్రీస్తు సూక్తులు ఆచరించి తోటివారిని ప్రేమించాలి

రెంటచింతల: క్రీస్తు సూక్తులు ఆచరించి తోటివారిని ప్రేమించాలని యనమదల చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ కన్నా మరియ అనీల్ అన్నారు. కానుకమాత చర్చి 174వ మహోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం విచారణ గురువులు ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పిచ్చుకల గడ్డ వద్ద నవదిన ప్రార్థనలలో భాగంగా నిర్వహించిన పవిత్ర సమిష్టి దివ్యపూజాబలిలో ఫాదర్ మరియ అనీల్ భక్తులనుద్దేశించి మాట్లాడారు. క్రీస్తు విశ్వాసులు ప్రతి రోజు కుటుంబ ప్రార్థనలు చేసి కరుణమయురాలు కానుకమాత ఆశీస్సులు పొందాలన్నారు. సహాయ గురువులు అగస్టీన్, డీకన్ బ్రదర్ కోడిగంటి నిఖిల్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెల్దుర్తి: ఎదురెదురుగా వస్తున్న క్వాలిస్, ట్రాక్టర్ ఢీ కొనటంతో ట్రాక్టర్‌పై ఉన్న కందుల వెంకటరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెల్దుర్తి నుంచి మాచర్ల వైపు టీడీపీ ఇన్‌చార్జి కాన్వాయ్ వస్తున్న సమయంలో ఉప్పలపాడు నుంచి పొలంలో బోరింగ్ మరమ్మతుల నిమిత్తం వెళ్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టుకోవటంతో రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ట్రాక్టర్‌పై ఉన్న కందుల వెంకటరెడ్డి తలకు బలమైన గాయాలు కావటంతో ఆయనను హుటాహుటిన మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

గురజాల: గురజాలలో పలు అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, సచివాలయ భవనాలు, కమ్యూనిటి హాల్ ఏర్పాటుకు స్థలం మంజూరు, ప్రతి ఇంటికి కుళాయినీరుకు శ్రీకారం చుట్టడం జరుగుతుంది. అదే విధంగా రహదారి విస్తరణలో తొలగించిన నేతల విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు

- కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- వైద్య శిబిరాలకు విశేష స్పందన
- గ్రామీణ ప్రజలకు తగ్గుతున్న వ్యయప్రయాసలు

పిడుగురాళ్లరూరల్: గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంపీడీవో కాశయ్య అన్నారు. మండలంలోని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కాశయ్య మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు తీసుకొని వచ్చి మెరుగైన సేవలను అందిస్తుందన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 553 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మెరుగైన వైద్య సేవల కోసం 12 మందిని ఉన్నత వైద్యశాలకు రిఫర్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు కేవీ నాగిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌కుమార్, డాక్టర్ అలేఖ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రకాష్, సూపర్‌వైజర్లు సౌరులు, సీహెచ్‌వోలు సాయి, సుజాత, కరుణమ్మ, లక్ష్మీదుర్గా, ప్రవళిక, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు పిడుగురాళ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీఎస్ గిరికుమార్ మంగళవారం తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 16వ వార్డు, 9వ వార్డుకు సంబంధించిన ప్రజలు హాజరై వైద్య సేవలు పొందాలని తెలిపారు.



వైద్య సేవలను నిర్వహిస్తున్న దృశ్యం

జగనన్న ఆరోగ్య సురక్ష..ప్రజలకు రక్ష

మాచవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని పిల్లుట్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు 104, 108, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, గ్రామ ఇన్‌చార్జి చింతారెడ్డి పుల్లారెడ్డి, ఎంపీడీవో వరప్రసాద్, వైద్యులు ప్రసాద్, అన్వేష్, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష వైద్య శిబిరాల ద్వారా మెరుగైన వైద్య సేవలు

కారెంపూడి: పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా మెరుగైన ఉచిత వైద్య సేవలందుతున్నాయని తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామ సచివాలయం-1 పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష ఉచిత వైద్య



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



జగనన్న సురక్ష వైద్య శిబిరానికి తరలివచ్చిన ప్రజలు

శిబిరం జరిగింది. శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 422 మంది ప్రజలు ఉచితంగా వైద్య సేవలు, మందులు పొందారు. వైద్య సేవలు పొందిన వారు చాలా సంతోషంగా ఇళ్లకు వెళ్లారు. డాక్టర్ కె.లక్ష్మీమౌనిక, డాక్టర్ కె.అలేఖ్య, డాక్టర్ ఆర్.కోటేశ్వరరావు నాయక్, ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.ప్రసాద్, ఆయుష్ డాక్టర్ కె.ఉదయలక్ష్మి వైద్య సేవలందించారు. ఉదయం తక్కువగా వచ్చినా సాయంత్రం పనులకు వెళ్లి వచ్చిన గ్రామస్తులు భారీగా వైద్య శిబిరానికి తరలివచ్చారు. జగనన్న సురక్ష కార్డులు రాయించుకుని వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకుని స్పెషలిస్ట్ డాక్టర్లకు చూపించుకున్నారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ ప్రారంభించారు. కారెంపూడి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది వైద్య శిబిరంలో సేవలందించారు.

ఆదర్శనీయులు మహాత్మాగాంధీ

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ప్రతి ఒక్కరికి మహాత్మాగాంధీ జీవితం ఆదర్శనీయమని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మహాత్మాగాంధీ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహాత్మాగాంధీ జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ఎదగాలని సుపరిపాలన అందిస్తున్నారన్నారు. గాంధీ ఆశయ సాధనతోనే ప్రతి గ్రామంలో గ్రామ స్వరాజ్యాన్ని సాధించాలనే సంకల్పంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ వెంకటరామారావు, పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, ఎస్సీ సెల్ కన్వీనర్ మాణిక్యరావు, మైనార్టీ సెల్ కన్వీనర్ బచ్చేమేస్త్రీ, బీసీ సెల్ కన్వీనర్ శివయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు జాషువా, దాచేపల్లి జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, నరసింహారావు, కౌన్సిలర్లు శారద, శ్రీనివాసరావు, శ్రీను, సైదావలి, నాగేశ్వరరావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్‌డీఎల్, జానిబాబు, ఏడుకొండలు, అలీం, కరాలపాడు సర్పంచ్ శివారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ, వైఎస్సార్ చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాసు

ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి ఏపీలో జరిగింది

నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు

గురజాల : ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి మన రాష్ట్రంలో జరిగిందని నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయివీరారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్‌లు అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి చెందలేదని ప్రజలకు మాయమాటలు చెబుతున్నారన్నారు. గురజాలలో జరిగిన అభివృద్ధిని అందరికి తెలిసే విధంగా చూపిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దూబచెరువులో పశువులు చేరేవన్నారు. కానీ నేడు ఆ పరిస్థితులు లేవన్నారు. దూబచెరువును ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గురజాల ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. అదే విధంగా బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, కౌన్సిలర్‌లు బండి రవికుమార్, కుక్కమూడి అన్నారావు, బీసీ విభాగం నాయకుడు చల్లా కాశీబాబు, డీకే తదితరులున్నారు.

బోర్ల కింద రబీలోనూ వరి సాగు



నారు మడిలో నారు పీకుతున్న కూలీలు

కారెంపూడి: మండలంలో ప్రస్తుతం బోర్ల కింద వరి సాగు పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వరి నాట్లు వేస్తున్నారు. మండలంలోని గ్రామాలలో ఖరీఫ్‌లో వేసిన విధంగానే రబీలో కూడా సుమారు 980 ఎకరాలలో వరి సాగు చేపట్టారు. దమ్ము చేసి నాట్లు వేసే పనులు జరుగుతున్నాయి. ధాన్యంకు ధర బాగా ఉండడంతో బోర్ల నీటిపైనే ఆధారపడి వరి సాగు చేపట్టారు. సాగర్ కాల్వలకు మంచి నీటి కోసం పది రోజుల క్రితం నీటి విడుదలతో భూగర్భ జల నీటి మట్టం పెరగడంతో బోర్లలో నీరు పుష్కలంగా వస్తోంది. ధైర్యంగా రైతులు వరి సాగు చేపట్టారు. వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందో కానీ వరి సాగు పనులు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయి.

సమర్థతకు పట్టం



మాచర్ల రూరల్: అవార్డులు ఉత్సాహంతో పాటు, బాధ్యతలను కూడా పెంచుతాయని కీలకమైన రెవెన్యూ శాఖలో ఉత్తమ ప్రతిభా అవార్డును అందుకోవటం అభినందనీయమని డిప్యూటీ తహసీల్దార్‌లు వాణి, షేక్ బాషా అన్నారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల అవార్డు పొందిన తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ ఫణి, వీఆర్‌వో చిరంజీవిలను సిబ్బంది సన్మానించిన సభలో మాట్లాడారు. యువకుడు, ఉత్సాహవంతుడైన తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్ అవార్డు అందుకోవటం రెవెన్యూ శాఖకే గర్వకారణమని, ఆయన ఉద్యోగుల పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఫణీంద్ర కుమార్, వీఆర్‌వో చిరంజీవి సేవలు అమూల్యమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు, టైపిస్టు శ్రీవలి, సీనియర్ అసిస్టెంట్ వలి, పల్నాడు జిల్లా వీఆర్‌వో సంఘం అధ్యక్షుడు ఆరుముల్ల నాగేశ్వరరావు, వీఆర్‌వోలు ప్రశాంతి, మహమ్మద్ హుస్సేన్, గోపాల్‌రెడ్డి, రవికుమార్, శ్రీను, అనిల్, వలి తదితరులున్నారు.

ఈవీఎంలపై అవగాహన

పిడుగురాళ్ల: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పిడుగురాళ్ల పట్టణంలోని ఐదు ఎన్నికల బూత్‌లకు సంబంధించి ఈవీఎంల పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ ఈవీఎంల ట్రైనర్ సంజీవ్ నాయక్ మాట్లాడుతూ ఈవీఎంపై బటన్ నొక్కిన వెంటనే ఏడు సెకన్ల వరకు ఓటర్ నొక్కిన గుర్తు కనిపిస్తుందని, దానిని ప్రతి ఒక్కరు గుర్తించాలని తెలిపారు. అలాగే పోలింగ్ ఆఫీసర్ ముందుగా ఈవీఎం బటన్ నొక్కిన తర్వాతనే ఓటర్ బటన్ నొక్కినప్పుడు గ్రీన్ బటన్ వెలుగుతుందని, అప్పుడు మాత్రమే ఓటు సవ్యంగా వేసినట్లు అని, రెడ్ బల్బు వెలిగితే ఓటు వేసినట్లు కాదని సూచించారు. పట్టణంలోని 260, 261, 284, 285, 287



ఈవీఎంలను బటన్ నొక్కి పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎన్నికల బూత్‌లకు సంబంధించిన అన్ని పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. దొంగ ఓట్లు నమోదు అయ్యే అవకాశం లేకుండా ఈవీఎంలు పని చేస్తాయని సూచించారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి

గాంధీజీ ఆశయాలు సాధించాలి: చైర్ పర్సన్ పోలు

గురజాల : జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయివీరారెడ్డి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద గాంధీ వర్ధంతి నిర్వహించారు. అనంతరం నిరుపేదలకు యాచకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానాన్ని ఎస్ఐ అశోక్ ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, కౌన్సిలర్లు కె.అనిల్‌కుమార్, బండి రవికుమార్, డీకే, చల్లా కాశీబాబు, స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం తదితరులున్నారు.

మహాత్మునికి ఘన నివాళులు

కారెంపూడి: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు మంగళవారం గాంధీ బొమ్మ సెంటర్‌లో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారెంపూడి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి యక్కల శ్రీనివాసరావు, కరాలపాటి సుబ్బారావు, గుండా శ్రీనివాసరావు, కొలిశెట్టి మల్లిఖార్జునరావు, కొత్తా బ్రహ్మేశ్వరరావు, వెచ్చా వరలక్ష్మణరావు, కజ్జం ఆంజనేయులు, సూరె సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ సేవలు ఎనలేనివి

మాచర్ల: పట్టణంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వారు నిర్వహించారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, శ్రీలక్ష్మీచెన్నకేశవ దేవాలయ ట్రస్టు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, అఖిల భారత వాసవి సత్రాల సలహా మండలి సభ్యులు చిల్లంచర్ల సత్యనారాయణ, యువజన సంఘం అధ్యక్షుడు కంభంపాడు అమర్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ తిరివీధి వెంకట నాగేశ్వరరావులు మాట్లాడారు. కార్యక్రమంలో కొత్తమాసు వెంకటేశ్వర్లు, రంగా చెన్నయ్య, ఆత్మకూరి పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, అంజి పాల్గొన్నారు.

మహాత్ముని అడుగుజాడలలో నడుద్దాం

రెంటచింతల: జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడలలో నడిచి ఆయన ఆశయసాధనకు కృషి చేద్దామని వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, ఆర్యవైశ్య మండల మాజీ అధ్యక్షుడు ఏచూరి వెంకట సైదయ్య అన్నారు. మంగళవారం మహాత్ముని వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక రామాలయం సెంటర్లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులకు టీషర్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, సత్రశాల దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మరెడ్డి, కోటిరెడ్డి, కాశిరెడ్డి, అర్చకులు కృష్ణమచార్యులు, నేతాజీ, సాంబశివరావు, శ్రీనివాసరావు, రాము, సైదారెడ్డి, మర్రెడ్డి, కృష్ణ, సత్యం, నాగిరెడ్డి, పాండు, రమణారెడ్డి పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో గాంధీ వర్ధంతి

పిడుగురాళ్ల: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ నాయకులతోపాటు పలు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద గాంధీ విగ్రహానికి, ఐలాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు వెంకటరామారావు, శంకర్‌రావు, శ్రీనివాసరావు, శివరామకృష్ణారావు, రఘురామయ్య, కృష్ణ, అచ్చిబాబు, కనకయ్య, శ్రీనివాసరావు, హనుమంతరావు, సుబ్బారావు, మట్టపల్లి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



రెంటచింతలలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నేత సైదయ్య



జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న కారెంపూడి ఆర్యవైశ్య సంఘ నాయకులు



మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

కష్టపడి పనిచేస్తే అవార్డులొస్తాయి

వెల్దుర్తి: అధికారులు కష్టపడి పనిచేస్తే అవార్డులు వాటంతట అవే వస్తాయని మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో పంచాయతీ రాజ్ ఏఈగా పనిచేస్తున్న పాశం శ్రీనివాసరెడ్డి కష్టపడి పనిచేస్తారన్నారు. 2023-24 సంవత్సరానికి రూ.5.12కోట్ల పనులు పూర్తి చేశారన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గోపాల్‌సింగ్‌నాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

మార్చి 9వ లోక్ అదాలత్

పిడుగురాళ్ల: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 9వ తేదీన పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎం.మురళీ గంగాధర్‌రావు మంగళవారం తెలిపారు. పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

మాచర్ల: రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించే లబ్ధి గురించి వివరించే బాధ్యత రిసోర్సు పర్సన్‌లదేనని స్థానిక మెప్మా ప్రాజెక్టు అధికారి ఎం.సుబ్బారావు అన్నారు. మంగళవారం స్థానిక మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించిన ఆర్పీల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం మానుకొండ కళ్యాణ మండపంలో నిర్వహించే వైఎస్సార్ ఆసరా పథకాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యే కార్యక్రమంలో డ్వాక్రా మహిళలను భాగస్వామ్యం చేయాలన్నారు. లబ్ధి పొందిన ప్రతి మహిళకు విషయాన్ని తెలిపేందుకు ఆర్పీలు తమ వంతుగా ప్రచార కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు రాజశేఖర్, అంజలి దేవి, ఆర్పీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా ప్రాజెక్టు అధికారులు

విద్యాభివృద్ధికి కృష్ణవేణి సంస్థల చర్యలు అభినందనీయం

పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

మాచర్ల: విద్యాభివృద్ధికి కృష్ణవేణి సంస్థల కృషి అభినందనీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక నరిశెట్టి కళ్యాణ మండపంలో కృష్ణవేణి విద్యా సంస్థల ఫేర్‌వెల్‌కి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. పల్నాడు జిల్లాలో కృష్ణవేణి విద్యా సంస్థల సేవలు ఎంతో ప్రశంసనీయమన్నారు. పేద విద్యార్థులకు చేయూతనందిస్తూ సీఎం జగన్ బాటననుసరిస్తూ ముందుకెళ్లటం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పాతూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణవేణి విద్యా సంస్థల ద్వారా ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్యనందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి కృష్ణవేణి విద్యా సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు, మాచర్ల కృష్ణవేణి విద్యా సంస్థ నిర్వాహకులు వెంకట్రామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి అవార్డు అందిస్తున్న పీవీఆర్

గుండెపోటుతో డాక్టర్ మృతి



డాక్టర్ సతీష్

దుర్గి: మండల కేంద్రమైన దుర్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మన్నవ సతీష్(51) గుండెపోటుతో మంగళవారం మరణించారు. కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం డ్యూటీ సమయానికి విధులకి రాకపోవటంతో డాక్టర్ ఇంటికి ఆసుపత్రి సిబ్బంది వెళ్లి తలుపు తట్టి పిలిచినా ఎంతకీ తెరవకపోవటంతో సిబ్బంది పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ కోటయ్యకు విషయం తెలిపారు. పోలీసుల సాయంతో తలుపులు తెరవగా బాత్రూంలో నిర్జీవంగా పడి ఉన్న సతీష్‌ను గుర్తించారు. వెంటనే గుంటూరులోని కుటుంబ సభ్యులకు చనిపోయిన విషయాన్ని తెలియజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా దుర్గి పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలను పొందారన్నారు. ఆయన మరణం పట్ల పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు విచారం వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఎం.రమేష్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెస్లి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ హనుమకుమార్, వైద్యులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుంటూరుకు తరలించారు. గురువారం గుంటూరులో అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేద్దాం

వెల్దుర్తి: మండలాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధి పథంలో నడుపుదామని మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. జన్మత్ పథకం ద్వారా మండలంలో చెంచు, గిరిజనులకు 156 గృహాల పనులు జరుగుతున్నాయన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.2.39లక్షలు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయన్నారు. మరో 70 మందికి గృహాలు మంజూరయ్యాయన్నారు. మండలంలో వివిధ భవనాలు రూ.5.12 కోట్లతో నిర్మించామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు మండలంలో 5లక్షల పనిదినాలు మంజూరు చేశామన్నారు. పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామన్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా ఇస్తున్నారన్నారు. అన్ని శాఖలపై సమీక్ష నిరవహించామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.